వైద్యం గగనం



ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం భవనం

- ఉదయగిరి సీహెచ్‌సీని వేధిస్తున్న వైద్యులు కొరత
- నెలలు తరబడి భర్తీ కానీ కీలక పోస్టులు
- వైద్యసేవలు అందక రోగుల ఇక్కట్లు

ఉదయగిరి: ఉదయగిరి సామాజిక ఆరోగ్యకేంద్రంలో వైద్యం గగనంగా మారింది. వైద్యుల కొరతతో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందడం లేదు. ఉదయగిరి జిల్లా కేంద్రానికి దూరంగా ఉండడం.. మెట్టప్రాంతం కావడంతో సీహెచ్‌సీకి వచ్చేందుకు వైద్యులు ఆసక్తి చూపక ఈ పరిస్థితి నెలకొంటోంది. గత కొంతకాలంగా ఈ సమస్య ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఇటీవల వింజమూరుకు వచ్చిన రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి వైద్యుల కొరత సమస్యను తీసుకెళ్లగా వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు నెరవేరలేదు.

ఖాళీగా కీలకమైన వైద్యుల పోస్టులు

ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి సీతారామపురం, వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు, మర్రిపాడు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు నిత్యం వస్తుంటారు.ముఖ్యంగా పేద వర్గాలకు చెందిన వారికి ఈ వైద్యశాలే దిక్కు. కానీ ఇక్కడ జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, చిన్న పిల్లల వైద్యులు, ఈఎన్‌టీ వంటి కీలకమైన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల మహిళా గైనకాలజిస్టు సైతం ప్రభుత్వ ఉత్తర్వులు తెచ్చుకుని చిత్తూరు జిల్లాకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. వాస్తవంగా వైద్యఆరోగ్య శాఖలో అన్ని డిప్యుటేషన్లను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ అదే ప్రభుత్వం గైనకాలజిస్టుకు డిప్యుటేషన్‌కు ప్రత్యేక ఆర్డర్ ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మత్తు వైద్యులు సైతం మెటర్నిటీ సెలవులో ఉన్నారు. ప్రస్తుతం దంత, మేల్ గైనకాలజిస్టు, ఆర్థో, కంటి వైద్యులు మాత్రమే ఉన్నారు. బీపీ, షుగర్‌కు సంబంధించిన పరీక్షలకు మరో వైద్యులు ఉన్నారు. వీరిలో కొంతమంది సకాలంలో విధులకు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం రూ.లక్షల్లో జీతాలు ఇస్తున్నా వైద్యులు,వైద్యసిబ్బంది విధులకు సక్రంగా రాకపోవడం, కొంతమంది సిబ్బంది రోగుల పట్ల అసభ్యకరంగా వ్యవహరించడం వంటి ఘటనలు ఉన్నాయి.

గత ప్రభుత్వంలో సేవలే మిన్న

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. వైద్యశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంతో పాటు వైద్యులు, సిబ్బందిని దాదాపు పూర్తి స్థాయిలో నియమించింది.దీంతో అప్పట్లో నిత్యం 250 నుంచి 300 మంది వరకు రోగులు వైద్యశాలకు వచ్చేవారు. వారికి అవసరమైన అన్ని మందులు ఉచితంగా ఇచ్చేవారు. అన్ని రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేవి.



వైద్యులు రాకపోవడంతో ఖాళీగా కుర్చీలు

కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వైద్యుల కొరత ఒక పక్క, మందుల కొరత మరో పక్క రోగులకు శాపంగా మారింది. దీంతో పాటు వైద్యులు, సిబ్బంది గ్రూపులుగా విడిపోయారు. తమ స్వార్థ ప్రయోజనాలు, ఆదిపత్యం కోసం సీహెచ్‌సీని బలిపశువుగా మార్చుతున్నారు. ఇటీవల డీడీఓ పవర్ కోసం ఓ వైద్యుడు మరో వైద్యుడ్ని ఇబ్బంది పెట్టే క్రమంలో చోటు చేసుకున్న పరిణామాలు కూడా భవిష్యత్తులో ఇక్కడికి వైద్య సిబ్బంది బదిలీలపై వచ్చేందుకు శాపంగా మారే అవకాశం ఉంది.



పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో నామమాత్రంగా వచ్చిన రోగులు

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

జిల్లాకు మారుమూల ప్రాంతం కావడంతో ఉదయగిరి సీహెచ్‌సీపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీంతో ఇక్కడి వైద్యులు, సిబ్బంది తాము ఆడిందే ఆట మాదిరిగా మారింది. ఎప్పుడు విధులకు వస్తారో..ఎప్పుడు ఎగనామం పెడుతారో తెలియని పరిస్థితి ఉంది. దీంతో పేదలకు వైద్యం గగనంగా మారింది.ఈ విషయమై డీడీఓ ప్రశాంత్‌ను వివరణ కోరగా సీహెచ్‌సీలో వైద్యుల కొరతతో పాటు కొన్ని సమస్యలు ఉన్న మాట వాస్తవమేనన్నారు. సీహెచ్‌సీలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

పురుషామృగంపై కోటేశ్వరస్వామి



సంగం: దువ్వూరులోని గంగాపార్వతి సమేత కోటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పురుషామృగ వాహనసేవను నేత్రపర్వంగా నిర్వహించారు. దేవదేవేరుల ఉత్సవమూర్తులను పురుషామృగ వాహనంపై కొలువుదీర్చి పూలతో విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. గౌడ్ కులస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

డీసీపల్లిలో 482 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 482 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 719 బేళ్లు రాగా, 482 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.281,కనిష్టంగా రూ.180, సగటున రూ.231.16 ధర పలికిందని వివరించారు. వేలంలో పది కంపెనీలకు చెందిన వ్యాపారప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

కలిగిరిలో 348 పొగాకు బేళ్ల విక్రయం

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 348 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 548 బేళ్లను తీసుకురాగా, 348 బేళ్లను కొనుగోలు చేశారని, మిగిలిన బేళ్లను కొనుగోలుకు తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.180, సగటున రూ.249.58 ధర పలికిందని వివరించారు. వేలంలో పదహారు కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరురూరల్: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల మరణించిన ఐదుగురి కుటుంబ సభ్యులను ట్రస్ట్ సభ్యులు కేవీ శేషారెడ్డి, తుమ్మలపెంట రమేష్, తదితరులు శుక్రవారం పరామర్శించి నగదు సాయం అందజేశారు.

వడ్ల బస్తాలు తగిలి టోల్‌బూత్ ధ్వంసం



ధ్వంసమైన టోల్ బూత్

మర్రిపాడు: లారీలోని వడ్ల బస్తాలు తగలడంతో టోల్‌ప్లాజాలోని బూత్ ధ్వంసమైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు..మర్రిపాడు నుంచి నెల్లూరు వైపు వడ్ల బస్తాల లోడుతో వెళ్తున్న లారీ డీసీపల్లి టోల్‌ప్లాజా వద్దకు రాగా అందులోని బస్తాలు తగలడంతో టోల్ బూత్ ధ్వంసమైంది. టోల్‌బూత్‌లో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. టోల్‌ప్లాజాలో టోల్‌లైన్లు ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



ఆత్మకూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాళెం సమీపంలోని టిడ్కో గృహ సముదాయం వద్ద శుక్రవారం కారు–బైక్ ఢీకొనడంతో కృష్ణారెడ్డి అనే వ్యక్తికి కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆత్మకూరు ఎస్సై జిలానీబాషా తెలిపారు.

వింజమూరు పంచాయతీ ఈఓగా కే రామారావు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మేజర్ పంచాయతీ నూతన ఈఓగా కొప్పోలు రామారావును నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో ఆయన వింజమూరు పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి ఉన్నారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

ఆత్మకూరురూరల్: అన్నదాత సుఖీభవ పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేయడానికి కృషి చేస్తున్నామని ఏఓ కిషోర్‌బాబు అన్నారు. మండలంలోని వాశిలి రైతుసేవా కేంద్రంలో రైతుల ఈకేవైసీ నమోదు ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 12,849 మంది రైతులను అర్హులుగా గుర్తించి జాబితాను ప్రభుత్వానికి పంపామని తెలిపారు. ఆర్టీజీఎస్ పరిశీలన తరువాత 6,400 మంది రైతులకు ఈకేవైసీ రావడం జరిగిందన్నారు. అన్నదాత సుఖీభవ జాబితాలోని రైతులు వీఏఏలను సంప్రదించి ఈకేవైసీ నమోదు చేసుకుంటే నగదు అందుతుందని తెలిపారు.



ఈకేవైసీ చేపడుతున్న వీఏఏ

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అందించాలి



సీతారామపురం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు




అనంతసాగరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

సీతారామపురం/సోమశిల : తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ అంగన్‌వాడీలు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జీవో ప్రకారం తమకు తల్లికి వందనం, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, పక్కాగృహాలు, తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు కోడె రమణయ్య, అంగన్‌వాడీలు గ్రేస్, జానీ, స్రవంతి, చంద్రమ్మ, మమత, సంపూర్ణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.అలాగే అనంతసాగరం తహసీల్దార్ జయవర్ధన్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వాలు అంగన్‌వాడీలకు గౌరవ వేతనం ఇస్తూ పార్ట్‌టైం ఉద్యోగులుగా చూస్తున్నాయని, వాళ్లకు సంక్షేమ పథకాలు అమలు చేసే విషయంలో మాత్రం ప్రభుత్వ ఉద్యోగులుగా చూస్తున్నాయన్నారు. గతంలో సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వం జీఓ ఇచ్చిందని, ఆ జీఓను అమలు చేసి అంగన్‌వాడీలు, స్కీం వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు నాగమణి, సునీత,జ్యోతి, పెంచల నరసమ్మ, సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై విచారణ

కొండాపురం: మండలంలోని పొట్టిపల్లిలో ప్రభుత్వ స్థలం ఆక్రమణపై తహసీల్దార్ కోటేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. తహసీల్దార్ తెలిపిన వివరాల మేరకు.. ప్రభుత్వం 1996లో పొట్టిపల్లిలో లేఅవుట్ నిర్మించి పేదలకు నివేశన స్థలాలు కేటాయించింది. ఈ లేఅవుట్‌లోని నాలుగు ప్లాట్లను గ్రామస్తులు గ్రామానికి ఉపయోగపడే భవన నిర్మాణాల కోసం వదిలిపెట్టారు. అందులో ఒకదానిలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించారు. ఇటీవల మిగిలిన ప్లాట్లను గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఆక్రమించి కంచె వేశాడు. గ్రామస్తులు అడ్డుకోబోగా తనవేనని వాదించాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు అంగన్‌వాడీ భవనానికి తాళం వేసి కంపచెట్లతో కంచి వేశారు. ఆక్రమణలను తొలగిస్తేనే తాళం తీస్తామని భీష్మించారు. దీంతో నాలుగు రోజులుగా అంగన్‌వాడీ చిన్నారులు చెట్ల కింద చదువులు సాగిస్తున్నారు. ఈ విషయం తహసీల్దార్ కోటేశ్వరరావు దృష్టికి రావడంతో ఆయన గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడి అంగన్‌వాడీ కేంద్రం తాళం తీయించారు. ఎవరైనా ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, సీడీపీఓ పద్మజాకుమారి, తదితరులు ఉన్నారు.



పొట్టిపల్లిలో ఆక్రమణకు గురైన స్థలం

యువకుడి ఆత్మహత్య

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం జనార్దనపురానికి చెందిన నల్లపనేని నాగార్జున (28) అనే యువకుడు శుక్రవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నాగార్జున కొంతకాలంగా బెంగళూరులో పనిచేస్తున్నాడు. ఇటీవల గ్రామంలో జరిగిన సీతారాముల ఉత్సవాలకు వచ్చాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఉరేసుకున్నట్లు పలువురు చెబుతున్నారు. గతంలోనే నాగార్జున తండ్రి మరణించాడు. విషయం తెలుసుకున్న కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మాలేపాటి చైతన్య బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.50 వేలు సాయం అందజేశారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం లేదు.

రేపట్నుంచి మాతమ్మ తిరునాళ్ల

సీతారామపురం : మండలంలోని సింగారెడ్డిపల్లి అరుంధతీయవాడలో గ్రామదేవత మాతమ్మ తిరునాళ్లను ఆదివారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. 15న సాయంత్రం పుట్ట బంగారం తెచ్చుట, 16న సాయంత్రం గ్రామోత్సవం, కోలాటం ప్రదర్శన, 17న రేణుక మా ఊరమ్మ కథ, 18న ఎడ్ల బండలాగుడు పోటీలు, 19న బండ్ల పొంగళ్లు, పండరి భజన నిర్వహించనున్నట్లు వివరించారు.

20న మండల సర్వసభ్య సమావేశం

ఉదయగిరి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 20న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అప్పాజీ శుక్రవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మూలె పద్మజ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

ఉదయగిరి రూరల్: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని, రైతులు పరిశీలించుకుని అర్హులైన వారు ఈకేవైసీ చేయించుకోవాలని ఉదయగిరి ఇన్‌చార్జి వ్యవసాయ సహాయసంచాలకుడు పీ చెన్నారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన రైతులు ఉదయం 10:30 నుంచి సాయంత్రం ఐదు గంటలలోపు ఆధార్‌కార్డుతో రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించి వేలిముద్ర వేసి ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని సూచించారు.

అలఘునాథస్వామి కల్యాణం రేపు

ఆత్మకూరురూరల్: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పురాతన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో అలఘునాథస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం రాత్రి 7 గంటలకు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వెలుగు ఏపీఎం బాధ్యతల స్వీకరణ



దుత్తలూరు: మండలం వెలుగు పథకం ఏపీఎంగా సరస్వతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరులో పనిచేస్తున్న ఆమె బదిలీపై దుత్తలూరుకు వచ్చారు. నూతన ఏపీఎంను కార్యాలయ సిబ్బంది, సీసీలు, వీఓఏలు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రఫీఖాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఈఓపీఆర్డీ డేవిడ్, పీఆర్ అధికారులు శ్రీనివాసులు, రామకృష్ణ, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

దర్గాల అభివృద్ధికి ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలి

ఉదయగిరి రూరల్: ప్రసిద్ధి చెందిన దర్గాల అభివృద్ధికి ప్రభుత్వం జాతీయ విధానాన్ని రూపొందించి ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆలిండియా సూఫీ సజ్జాదానషీన్ కౌన్సిల్(ఏఐఎస్ఎస్‌సీ) ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అహ్మద్‌బాషాఖాలిది కోరారు. పట్టణంలోని ఖాదరియా ఆస్తానాలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రాచుర్యం పొందిన దర్గాలు 600 ఉన్నాయని, వాటిని ప్రతిదినం లక్షలాది మంది భక్తులు దర్శించుకుంటున్నారని తెలిపారు. అయితే దర్గాల అభివృద్ధిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దర్గాధిపతులు (సజ్జాదానషీన్లు) ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలు పరిష్కరించడం ద్వారా భక్తులకు మేలు చేకూరుతుందన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా యువతను తప్పుదోవ పట్టించే తీవ్రవాద చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమించి, యువతను సన్మార్గంలో నడిపించడం కోసం ఏఐఎస్ఎస్‌సీ కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు దస్తగిరిఅహ్మద్, జహీర్, ఖాజా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎండీ అహ్మద్‌బాషాఖాలిది

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మర్రిపాడు: 33 కేవీలైన్లకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా మండలంలోని చినమాచనూరు, కృష్ణాపురం, బ్రాహ్మణపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ హరికృష్ణ శుక్రవారం తెలిపారు.

అల్లూరు: మండలంలోని అల్లూరుటౌన్, నార్త్‌మోపూర్, నార్త్‌ఆములూరు, బీరంగుంట, గ్రద్ధగుంట గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు అల్లూరు టౌన్ ఏఈ షేక్ మస్తాన్ తెలిపారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమమ్మతులు చేపడుతున్న దృష్ట్యా మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగూర్‌వలి తెలిపారు.

దుత్తలూరు: దుత్తలూరు: వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా నర్రవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటసుబ్బయ్య తెలిపారు.

కలిగిరి: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్ల మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ దినేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

ఆత్మకూరురూరల్: విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా పట్టణంలోని పంటవీధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ జమీలాబేగం శుక్రవారం తెలిపారు. అలాగే పాత ఎల్ఆర్‌పల్లి ఫీడర్‌లో కూడా విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏఓల బాధ్యతల స్వీకరణ



సంగం: బాధ్యతలు స్వీకరించిన శశిధర్



కలిగిరి: బాధ్యతలు స్వీకరించిన జహీర్

సంగం: మండల వ్యవసాయాధికారిగా శశిధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా మండల ఏఓగా పనిచేస్తున్న శ్రీహరి బుచ్చిరెడ్డిపాళేనికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో చేజర్ల ఏఓగా పనిచేస్తున్న శశిధర్ బాధ్యతలు చేపట్టారు. నూతన ఏఓకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఏఓ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు రైతుసేవా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. ఏఈఓ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: మండల వ్యవసాయాధికారిగా షేక్ జహీర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా మనుబోలు నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు మండల ఏఓగా విధులు నిర్వర్తించిన సురేష్‌బాబు ఏఎస్‌పేటకు బదిలీపై వెళ్లారు. నూతన ఏఓను వ్యవసాయశాఖ సిబ్బంది మర్యాదపూ ర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వీఏఏలతో ఏఓ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఉదయగిరి: ఉదయగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ మండలాల వ్యవసాయ అధికారులు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఉదయగిరి ఏఓ ఆంజనేయులునాయక్ పల్నాడు జిల్లా నూజెండ్ల, వరికుంటపాడు ఏఓ రవికుమార్ ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు, మర్రిపాడు ఏఓ రామ్మోహన్ నెల్లూరు డీఆర్సీకి బదిలీ అయ్యారు. దుత్తలూరు ఏఓ సుబ్బారెడ్డి ఉదయగిరి టెక్నికల్ ఏఓగా నియమితులయ్యారు. మర్రిపాడు మండలానికి నెల్లూరు సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లో పనిచేస్తున్న శివరంజనిని ఏఓగా నియమించగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మిగిలిన మండలాలకు ఇంకా ఎవరిని నియమించలేదు.



బాధ్యతలు స్వీకరించిన వాసు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల వ్యవసాయాధికారిగా ఏ వాసు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పాదలకూరు ఏఓగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న శ్రీమన్నారాయణ కావలికి బదిలీపై వెళ్లారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

సీతారామపురం: మలేరియాపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారిణి స్వప్నరెడ్డి అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా సీతారామపురంలో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కీటకజనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోధకాలు, తదితర వ్యాధుల నియంత్రణ మనతోనే సాధ్యమన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు రాత్రి వేళల్లో దోమలు కుట్టకుండా దోమతెరలను వాడడం ద్వారా కీటకజనిత వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి గాజుల నౌషాద్‌బాబు, ఎంపీహెచ్‌ఈఓ మజీద్, ఎంపీహెచ్ఎస్ రియాజ్, తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరురూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణాధికారిణి హుస్సేనమ్మ అన్నారు. మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం ఎస్టీకాలనీలో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలతో డెంగీ, చికెన్ గున్యా,మలేరియా, తదితర వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడంతో పాటు దోమలు కుట్టకుండా దోమతెరలను వినియోగించాలని సూచించారు. ఎంపీహెచ్‌ఈఓ సిద్ధం సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న హుస్సేనమ్మ

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



సీతారామపురంలో యోగాపై శిక్షణ



ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో..

సీతారామపురం: నిత్యం యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డిప్యూటీ ఎంపీడీఓ భార్గవిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వైద్యఆరోగ్య, ఐసీడీఎస్, వెలుగు సిబ్బందికి శుక్రవారం నిర్వహించిన యోగా శిక్షణలో ఆమె మాట్లాడారు. యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. మారిన జీవనశైలికి అనుగుణంగా ప్రతిఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. అనంతరం యోగాసనాలు వేయించారు. వైద్యాధికారిణి స్వప్నరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎంజీఆర్ బస్‌స్టేషన్ వద్ద పట్టణ ప్రజలతో భారీ యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మర్యాదపూర్వకంగా..

ఆత్మకూరురూరల్: మండల నూతన తహసీల్దార్ పద్మజాకుమారిని పలువురు ప్రజాప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ కేతా విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ శివకోటారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.